సాక్షి
అనకాపల్లి
సోమవారం ı 2 ı అక్టోబర్ ı 2023



క్రీడాకారులకు ప్రోత్సాహం
పోర్టు ఇండోర్ స్టేడియంలో అండర్ -11 జాతీయ చదరంగం పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 8లో



ఎయిర్‌పోర్టులో ఎక్స్‌ట్రా పార్కింగ్
విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం అన్ని హంగులతో పాటు కార్ పార్కింగ్ సౌకర్యాన్ని కూడా విస్తరించుకుంది. 8లో



వహ్వా.. 'కాఫీ'
సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి,రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి చలపతిరావు ఏజెన్సీలో పర్యటించారు. 8లో

ప్రతి పల్లె ప్రగతి 'బాట'





చీడికాడ మండలం తుమ్మవానిపాలెం టూ సీతబంద

నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సుమాలు వికసించాయి. మట్టి రోడ్ల కష్టాలకు కాలం చెల్లింది...పక్కా రోడ్లతో జిల్లాలోని మారుమూల ప్రాంతం కళకళలాడుతోంది. తండాలకు అభివృద్ధి 'బాటలు' పడుతున్నాయి. శివారు గ్రామాలు పట్టణాలతో రహదారి బంధం పెనవేసుకుంటున్నాయి. గత పాలకుల హయాంలో నిర్లక్ష్యానికి గురైన శిథిల రహదారులకు డిప్యూటీ సీఎం చొరవతో మోక్షం లభించింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్, పీఆర్, ఏఐఐబీ గ్రాంట్, పీఎంజీఎస్‌వై గ్రాంట్లతో శిథిలమైన పాత రోడ్లను పునర్నిర్మించి ఆధునికంగా తీర్చిదిద్దారు.

- చీడికాడ, మాడుగుల మండలాలను కలిపే ఎల్బీపట్నం రోడ్డుకు మోక్షం
- డిప్యూటీ సీఎం చొరవతో రూ.2.7 కోట్లతో నిర్మాణం పూర్తి
- మాడుగుల నియోజకవర్గంలో రూ.59.08 కోట్లతో 41 బీటీ రోడ్లు పూర్తి
- రూ.51.63 కోట్లతో 669 సీసీ రోడ్లు పూర్తి
- పురోగతిలో మరో 12 బీటీరోడ్లు

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో మారుమూల మాడుగుల నియోజకవర్గంలో రూ.59.08 కోట్ల నిధులతో 41 బీటీ రోడ్లు, రూ.51.63 కోట్ల నిధులతో 669 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. మరో 12 బీటీ రోడ్లకు నిధులు మంజూరై..కొన్ని పురోగతిలో, మరికొన్ని టెండర్ దశలో ఉన్నాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్, పీఆర్, ఏఐఐబీ గ్రాంట్, పీఎంజీఎస్‌వై గ్రాంట్లతో శిథిలమైన పాత రోడ్లను పునర్నిర్మించి ఆధునికంగా తీర్చిదిద్దారు. చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల మండలాల్లో గ్రావెల్, మట్టి, కంకర రోడ్లు ఉన్న చోట కూడా ప్రధాన రహదారులతో పాటు మండల, గ్రామ పంచాయతీ కేంద్రాల్లోనూ బీటీ, సీసీ రోడ్లకు నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేశారు. మారుమూల గ్రామాలకు, తండాలకూ కొత్త రహదారుల నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా గ్రామాల్లోనూ ప్రతి వార్డులో, వీధుల్లో సీసీ రోడ్లు వేశారు గ్రామ పంచాయతీల్లో ఉన్న మట్టిరోడ్లను సీసీరోడ్లుగా నిర్మాణాలు చేపట్టారు.

డిప్యూటీ సీఎం చొరవ..

నియోజకవర్గంలో కొన్ని ప్రధానమైన రోడ్లు పరిశీలిస్తే..మాడుగుల, చీడికాడ మండలాలను కలుపుతూ 5 కిలోమీటర్ల మేర ఉన్న 'ఎల్.బి.పట్నం–మాడుగుల' బీటీ రోడ్డు 15 ఏళ్లుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోకుండా పూర్తిగా శిథిలమైంది. గతంలో ఈ బీటీ రోడ్డు ఎల్.బి.పట్నం నుంచి కె.ఎల్.బి.పట్నం వరకు(చీడికాడ మండల సరిహద్దు)వరకూ, మాడుగుల నుంచి కె.ఎల్.బిపట్నం(మాడుగుల సరిహద్దు) వరకు నిర్మాణం చేపట్టారు. అయితే ఈ సరిహద్దుల మధ్య సుమారు 200 మీటర్ల మేరకు మెటల్‌రోడ్డు గానే మిగిలిపోయింది. ఈ రెండు రోడ్లు శిథిలమవడంతో పాటు మధ్యలో 200 మీటర్ల మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఈ సమస్యను రెండు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అనంపూర్తిగా మిగిలిన మెటల్‌రోడ్డును తారురోడ్డుగా నిర్మించేందుకు రూ.2.7 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఎల్.బి.పట్నం నుంచి మాడుగులకు రోడ్డు నిర్మాణ పనులను మూడు మాసాల క్రితం ప్రారంభించి నిర్మాణం వేగవంతం చేసి యుద్ధప్రాతిపదికన రోడ్డును అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఏళ్ల తరబడి గ్రామీణులు పడుతున్న రహదారి కష్టాలకు తెరపడింది.





చీడికాడ మండలం కె.ఎల్.బి పురం నుంచి అప్పలరాజుపురం రోడ్డు

మాడుగుల నియోజకవర్గంలో..

- మాడుగుల మండలంలో రూ. 6.89 కోట్లతో 10.8 కిలోమీటర్ల మేర 6 బీటీ రోడ్ల నిర్మాణం పూర్తయింది. రూ.7.7 కోట్లతో 15.20 కిలోమీటర్ల మేర 132 సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయింది.
- చీడికాడ మండలంలో 40.48 కిలోమీటర్ల మేర 17 బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.23.14 కోట్ల నిధులు మంజూరు చేశారు. వీటిలో 13 రోడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. మిగిలిన నాలుగు రోడ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. రూ.1.6 కోట్లతో 4 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మాణం పూర్తయ్యాయి.
- దేవరాపల్లి మండలంలో 27.89 కిలోమీటర్ల మేర 11 బీటీ రోడ్ల నిర్మాణం పూర్తయింది. రూ.18.19 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రూ.20.21 కోట్ల నిధులతో 233 సీసీ రోడ్లు నిర్మించారు.
- కె.కోటపాడు మండలంలో 13.58 కిలోమీటర్ల మేర 11 బీటీ రోడ్ల నిర్మాణం పూర్తయింది. రూ.10.86 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రూ.22.12 కోట్ల నిధులతో 23 కిలోమీటర్ల మేర 144 సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.

పట్టణ ప్రాంతాలకు దీటుగా...



గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి కోసం వెచ్చించాల్సిన నిధులను ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేశారు. నాడు టీడీపీ ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో రోడ్లు శిథిలావస్థకు, మరమ్మతులకు గురయ్యాయి. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామీణ రహదారుల నిర్మాణాలు చేపట్టాం. గ్రామాల్లో ప్రస్తుతం రోడ్లు అద్దంలా మెరుస్తున్నాయి. ఒక వైపు పంచాయతీరాజ్ శాఖ, మరో వైపు ఆర్‌అండ్‌బీ, ఏఐఐబీ, పీఎంజీఎస్‌వై నిధులతో మారుమూల గ్రామాల్లో సైతం నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాం. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, గ్రామాల అభివృద్ధి సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డితో సాధ్యమైంది.

– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

గ్రావెల్, మట్టి రోడ్లకు మహర్దశ



ఎప్పటినుంచో గ్రావెల్, మట్టి రోడ్లుగా ఉన్న మారుమూల గ్రామాల్లో కూడా తారు రోడ్లు వేశాం. చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు మండల పరిధిలో 35 బీటీ రోడ్లు, 509 సీసీ రోడ్లు నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 12 బీటీ రోడ్లు పనులు పురోగతిలో ఉన్నాయి. ఇవి పూర్తయితే మాడుగుల నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతంలో గల బీటీ రోడ్ల నిర్మాణం పూర్తయినట్లే.

– రమణ, పంచాయతీ రాజ్ డీఈ

న్యూస్‌రీల్

సీఐల బదిలీలు
సాక్షి, విశాఖపట్నం: విశాఖ సిటీ వీఆర్‌లో ఉన్న ఐదుగురు సీఐలను రేంజ్ వీఆర్‌కు, విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న నలుగురు సీఐలను విశాఖ సిటీకి బదిలీ చేశారు. ఈ మేరకు విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సిటీ వీఆర్‌లో ఉన్న రంబ సత్యనారాయణ, ఏవీ లీలారావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, ఎస్.షణ్ముఖరావు, ఎస్.కాంతారావు విశాఖ రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. రేంజ్ వీఆర్‌కు చెందిన ఎస్.అమ్మినాయుడు, జి.గోవింద్‌రావు, వి.చక్రధరరావు, సీహెచ్ వాసునాయుడులను విశాఖ సిటీకి బదిలీ చేశారు.

నేడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విశాఖ రాక
శొంఠ్యాంలో ఆయుర్వేదిక్ ఫార్మసీ ల్యాబ్‌కు శంకుస్థాపన

మహారాణిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని సోమవారం విశాఖ వస్తున్నారు. సాయంత్రం 4.05 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం శొంఠ్యాం వెళ్తారు. అక్కడ రూ.6.67 కోట్లతో నిర్మించే ఆయుర్వేదిక్ ఫార్మసీ అండ్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌కు ఆమె శంకుస్థాపన చేస్తారు. అక్కడ నుంచి విశాఖ చేరుకుని రాత్రికి బస చేస్తారు. 3న ఇసుకతోటలో కొత్తగా నిర్మించిన యూపీహెచ్‌సీ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారు. అక్కడ నుంచి పాడేరు వెళతారు.

పాపికొండల పర్యాటకం పునః ప్రారంభం



పర్యాటకులతో వెళుతున్న హరిత బోటు

వీఆర్‌పురం: వరద ప్రభావంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోటు నిర్వాహకులు గత జూలై నెలలో నిలిపివేసిన పాపికొండల పర్యాటకాన్ని మళ్లీ ప్రారంభించారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో సబ్‌కలెక్టర్ సూరజ్‌గనోరే పర్యాటకాన్ని పునఃప్రారంభించేందుకు అనుమతి ఇచ్చారని టూరిజం యూనిట్ ఇన్‌చార్జ్ మేనేజర్ రాజేష్ తెలిపారు. ఆదివారం 80 మంది పర్యాటకులతో ఏపీ టూరిజానికి చెందిన హరిత బోటు పాపికొండల పర్యాటకానికి గోదావరి నదిలో వెళ్లిందని ఆయన చెప్పారు.

పోర్టులో స్పెషల్ క్యాంపెయిన్



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే

మహారాణిపేట: విశాఖపట్నం పోర్టు అథారిటీలో ఆదివారం స్వచ్ఛ భారత్ అభియాన్ స్పెషల్ క్యాంపెయిన్ 3.0 ప్రారంభమైంది. ఈ నెల 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. డాక్ ఏరియాలో జరిగిన ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రం చేసేందుకు గంట సమయాన్ని కేటాయించాలన్నారు. పోర్టు పరిసరాల్లో గాలి కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డాక్ ఏరియాతోపాటు పోర్టులోని ఆర్‌అండ్‌డీ యార్డు, సిగ్నల్ స్టేషన్, గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిలో శ్రమదానం జరిగింది. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, శబరిమలి, సింగపూర్ నౌకల సిబ్బంది పాల్గొన్నారు.

మామిడివాడ సచివాలయంలో పింఛన్ సొమ్ము చోరీ
రాంబిల్లి: మండలంలోని మామిడివాడ గ్రామ సచివాలయంలో రూ.58 వేల పింఛన్ సొమ్ము చోరీకి గురైంది. శనివారం సాయంత్రం ఈ సొమ్ము చోరీ జరిగినట్లు తెలిసింది. గత నెలలో ఇదే పంచాయతీ శివారు కలవలపల్లి వలంటీర్ రూ.60 వేల చోరీ జరిగినట్లు చెప్పడం, అప్పుడు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు రూ.2 వేల చొప్పున చందాలు వేసుకుని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇక్కడ లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున తగ్గించి ఆయా వలంటీరు పంపిణీ చేసినట్లు ఆయా గ్రామ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే కన్నబాబురాజు దృష్టికి వెళ్లడంతో వలంటీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎంపీడీవో కొండలరావు దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సరస్వతి సమాచారం మేరకు చోరీపై విచారణ చేస్తున్నట్లు సీఐ గఫూర్ తెలిపారు.

విద్యాశాఖలో వసూళ్ల పర్వం

- ప్రైవేట్ స్కూళ్ల రెన్యువల్స్‌లో అవకతవకలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యాశాఖ మంత్రి
- ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్‌పై సరెండర్ వేటు
- సమగ్ర విచారణకు ఆదేశించిన కమిషనర్

విశాఖ విద్య: విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయం కేంద్రంగా సాగుతున్న వసూళ్ల పర్వంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఇందుకు బాధ్యుడిగా కార్యాలయ సూపరింటెండెంట్ ఆనంద్‌రెడ్డిని కమిషనరేట్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఆర్జేడీ జ్యోతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఈ విషయం వెలుగులోకి రావడంతో విద్యాశాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఏడాది నుంచి ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు, రెన్యువల్ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. భవిష్యత్‌లో అంతా ఆన్‌లైన్ విధానంలోనే ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నందున, ఇందుకు 2023–24 విద్యా సంవత్సరం నుంచే అమలుకు విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు ఎంఈవో, డిప్యూటీ డీఈవో సిఫార్సుతో ప్రైవేట్ స్కూళ్ల నిర్వహణకు డీఈవో కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. హైస్కూళ్లకు అయితే డిప్యూటీ డీఈవో, డీఈవో కార్యాలయ స్థాయిలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసి.. స్కూళ్ల నిర్వహణకు అఫిలియేషన్‌ను ఆర్జేడీ ఇస్తారు. ఇదంతా పారదర్శకంగా చేపట్టాలని ఉన్నతాధికారులు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే విద్యాశాఖలోని కొంతమంది అధికారులు, ఉద్యోగులు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఇటీవల కాలంలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్జేడీ కార్యాలయంలో డబ్బులు ఇస్తేనే ఫైలు ముందుకెళ్తోందని, స్కూళ్లను బట్టి గుర్తింపు, రెన్యువల్‌కు రేటు నిర్ణయించి.. డబ్బులు ఇవ్వనిదే పనిచేయడం లేదని కొంత మంది ప్రైవేట్ స్కూళ్ల యజమానులు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్జేడీ కార్యాలయ అధికారులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ రంగంలోకి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం సూపరింటెండెంట్ ఆనంద్‌రెడ్డిని కమిషనరేట్‌కు సరెండర్ చేసినట్లు ఆర్జేడీ జ్యోతి కుమారి 'సాక్షి'కి తెలిపారు.

నేడు జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక
అనకాపల్లిటౌన్: జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఎంపిక పోటీలు స్థానిక జూనియర్‌క్లబ్ ఆవరణలో సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్టు టెన్నిస్ క్రీడాకారుల జిల్లా చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాయి క్రీడా పోటీలు ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకూ అనంతపురం జిల్లాలో జరుగుతాయని, ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పురుషులు, మహిళలు, 17 సంవత్సరాలలోపు బాలబాలికల ఎంపిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9441149808 నంబరును సంప్రదించాలని కోరారు.

• స్వచ్ఛ సంకల్పం...



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనకాపల్లి గాంధీ పార్కును శుభ్రం చేస్తున్న ఎంపీ బి.వి.సత్యవతి

లంబసింగి అందాలకు కలెక్టర్ ఫిదా



లంబసింగి అందాలు తిలకిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగి అందాలకు అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఫిదా అయ్యారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. గతంలో పాడేరు ఐటీడీఏ పీవోగా పనిచేసిన ఆయనను ఇక్కడ ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలు మార్లు లంబసింగి అందాలను వీక్షించిన ఆయన తాజాగా మళ్లీ కుటుంబ సభ్యులతో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించారు.

తీరంలో చేపలకు కృత్రిమ ఆవాసాలు

పునరుత్పాదక ఆహారపు వనరులో సాగరానిదే ప్రథమ స్థానం. అయితే అందులో మనం వినియోగించుకునే భాగం చాలా స్వల్పం. దీంతో అందుబాటులో ఉండే సాగర తీరాల్లో మత్స్య సంపద పెంపునకు సరికొత్త మార్గాలపై నిత్యం అన్వేషణ జరుగుతూనే ఉంది. అందులో ఓ భాగమే సముద్ర తీరాల్లో మత్స్య సంపద వృద్ధికి కృత్రిమ ఆవాసాల ఏర్పాటు. ఇప్పటికే తమిళనాడులో విజయవంతమైన ఈ కార్యాచరణను మన రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అందుకు అనకాపల్లి జిల్లా వేదిక కానుంది.

- మత్స్య సంపద పెంపునకు సరికొత్త ప్రయోగం
- ప్రతిపాదనలో పాయకరావుపేట, నక్కపల్లి తీరాలు
- పూడిమడకలో ఆవాస కేంద్రంపై పునరాలోచన

అచ్యుతాపురం(అనకాపల్లి): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులను పెంచుకోవాలి. భూమిపై నేల పరిమాణాన్ని పెంచే అవకాశం లేదు. భూగోళంపై 29 శాతం నేల ఉంటే.. మిగిలిన 71 శాతం నీరే. ఈ నీరు కూడా 97 శాతం సముద్రాలుగా, 2 శాతం ధ్రువప్రాంతాల్లో మంచుగా, ఒక శాతం ఇతర రూపంలో ఉంది. దీంతో సముద్రంలో దొరికే పోషకాహారంపై ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాయి.

ద్వీపకల్ప భారత్‌లో అవకాశాలు మెండు

భౌగోళికంగా ప్రత్యేకత సంతరించుకున్న భారత్‌కు అనేక అనుకూల అంశాలు ఉన్నాయి. మూడు వైపులా సముద్ర తీర ప్రాంతంలో ఉన్న మత్స్య సంపదను మరింత పెంపొందించుకోవాలి. భూతాపం, కాలుష్య కారకాలతో మత్స్య సంపదకు నష్టం వాటిల్లకుండా ముందుకు సాగాలి. ఈ క్రమంలోనే కొచ్చిన్‌లోని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సీఎంఎఫ్‌ఆర్‌ఐ) శాస్త్రవేత్తలు కొత్త ఆలోచనలకు తెరతీశారు. మత్స్య సంపదపై ఆధారపడి జీవించే మత్స్యకారుల ఉపాధి, మత్స్యరాశుల పెంపు లక్ష్యంగా కృత్రిమ ఆవాసాల ఏర్పాటును ప్రతిపాదించారు. ఇప్పటికే తమిళనాడులో ఈ విధానం సత్ఫలితాలిస్తోంది. దీంతో దేశంలోని గుజరాత్, కేరళ, ఆంధ్రప్రదేశ్ తీరాలను అనుకుని కృత్రిమ ఆవాసాల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తం 3,477 తీర ప్రాంత గ్రామాలను అనుకుని వీలైనన్ని ఎక్కువ కృత్రిమ ఆవాసాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎంఎఫ్‌ఆర్‌ఐ శాస్త్రవేత్తలు ప్రకటించారు.



సముద్రంలో ఏర్పాటు చేసే మత్స్య సంపదకు సంబంధించి కృత్రిమ ఆవాసాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం

తీర ప్రాంతాల్లో ఉండే అనేక కదలికలు, అలల తాకిడి, కాలుష్యం కారణంగా కొన్ని ప్రాంతాలకు చేపలు రావడం లేదు. దీంతో ఎంపిక చేసిన తీరాల్లో సిమెంట్‌తో చేసి వివిధ రకాల ఆకృతులను కొద్ది పాటి దూరంలో ఉంచనున్నారు. ఈ కృత్రిమ ఆవాసాల ప్రక్రియను సీఎంఎఫ్‌ఆర్‌ఐ పర్యవేక్షిస్తుంది. దీనికి అవసరమైన నిధుల్ని కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తుంది. దేశంలో 132 ప్రాంతాల్లో 3.7 లక్షల చదరపు మీటర్ల మేర మత్స్య సంపదను గుర్తించారు. మామూలుగా వచ్చే మత్స్య సంపదతో పోలిస్తే ఈ ప్రక్రియ ద్వారా 17 నుంచి 30 శాతం అధికంగా మత్స్య సంపద లభిస్తోందని కొచ్చిన్ కేంద్రంగా జరిపిన అధ్యయనంలో తేలింది. తీర ప్రాంతానికి కొద్ది పాటి దూరంలో వేసే సిమెంట్ బ్లాక్స్ వద్దకు చేపలు చేరి అక్కడే ఆవాసం ఏర్పరచుకుని, సంతానోత్పత్తి జరుపుతాయి. దీంతో ఏడాదికి సగటున 1,331 టన్నుల మత్స్య సంపద వృద్ధి జరుగుతున్నట్లు అధ్యయనంలో తేలింది.

అనకాపల్లి జిల్లాలో మూడు

తీర ప్రాంతాల్లో కృత్రిమ ఆవాసాల ఏర్పాటుకు అనకాపల్లి జిల్లాను కూడా ఎంపిక చేసినట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లాలోని నక్కపల్లి, పాయకరావుపేట మండలాల పరిధిలో ఇప్పటికే ఆయా కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు ఖరారయ్యాయి. పూడిమడక వద్ద ఏర్పాటు చేయాలని భావించిన ఆవాస కేంద్రంపై సంబధిత శాఖ పునరాలోచనలో పడింది. స్థానిక పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల కారణంగా ఇక్కడ మత్స్య సంపదకు నష్ట వాటిల్లుతుందన్న సందేహాలే కారణమని సమాచారం.

మత్స్యకారులకు ఉపాధి



జిల్లాలో మూడు చోట్ల కృత్రిమ ఆవాస కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ ప్రక్రియ మొత్తం సీఎంఎఫ్‌ఆర్‌ఐ నిపుణుల పర్యవేక్షణలోనే జరుగుతుంది. తమిళనాడులో మత్స్య సంపద వృద్ధికి కృత్రిమ ఆవాసాలు దోహదపడ్డాయి. సముద్ర తీరాల పరిరక్షణ, మత్స్య సంపద వృద్ధికి, మత్స్యకారుల ఉపాధికి ఇది మేలైన కార్యక్రమం.

– పురుషోత్తపట్నం ప్రసాద్, ఇన్‌చార్జి ఏడీ, జిల్లా మత్స్య శాఖ



ప్రమాద బాధితుడికి రూ. 26,500 సాయం



నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రావికమతం: వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొత్తకోటకు చెందిన ప్రైవేటు టీచర్ పడమటి శ్రీనివాసరావుకు స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి 2010 బ్యాచ్ విద్యార్థులు రూ.26,500 సాయం అందించారు. శ్రీనివాసరావుతోపాటు అతడి తల్లి హృద్రోగ సమస్యతో బాధపడుతుండటంతో వృద్ధ తండ్రి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. దీనిపై అనుకోని ప్రమాదం అంతులేని ఆవేదన శీర్షికన సాక్షిలో గత నెల 24న కథనం ప్రచురితం కావడంతో పలువురు దాతలు స్పందించి సాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగా పూర్వ విద్యార్థులు తన మిత్రుడికి ఆదివారం నగదు అందించారు.

ఇద్దరు హిజ్రాల అరెస్టు

మునగపాక: మండలంలోని పాత నాగవరంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులతో పాటు ఇద్దరు హిజ్రాలను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మహమ్మద్ అలీ తెలిపారు. వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పాత నాగవరంలో ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా హిజ్రాలతో నృత్య ప్రదర్శన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అలీ సంఘటనా స్థలానికి చేరుకొని ఎటువంటి అనుమతులు లేకుండా హిజ్రాలతో నృత్యం చేయిస్తున్న నిర్వాహకులు అయిదుగురిని అరెస్టు చేశారు. ఇద్దరు హిజ్రాలను కూడా అరెస్టు చేశారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- అండర్–11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ ప్రారంభం



ఫిడే మాస్టర్ సాహితీతో ఎత్తుకు పైఎత్తు వేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



పోర్ట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన చదరంగం ఆడుతున్న అండర్-11 క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన విద్య, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్యం, యువత మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం అండర్–11 జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను అందించి ప్రోత్సహిస్తోందన్నారు. విశాఖలో అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన ప్రారంభిస్తుండటంతో.. విశాఖలో మరిన్ని వసతుల కల్పనతో పాటు అభివృద్ధి వేగవంతం కానుందన్నారు. విశాఖ వేదికగా జాతీయ స్థాయిలో చదరంగం పోటీలు నిర్వహించడం... ఇక్కడ నుంచే ఆలనా మీనాక్షి, సాహితీ వర్షిణి లాంటి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. అనంతరం ఫిడే మాస్టర్ టైటిల్ సొంతం చేసుకున్న సాహితీ వర్షిణితో తొలి మూవ్ వేసి చాంపియన్‌షిప్‌ను ప్రారంభించారు. టాప్ బోర్డుపై ఆడుతున్న ఫిడే రేటెడ్ క్రీడాకారులతో పాటు పోటీకి సిద్ధపడిన పలువురి చిన్నారులను సుబ్బారెడ్డి పరిచయం చేసుకుని వారిలో ఉత్సాహం నింపారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, ఆంధ్రా చెస్ సంఘం అధ్యక్షుడు కె.వి.వి.శర్మ, రాష్ట్ర, జిల్లా చదరంగం ప్రతినిధులు, టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ చాంపియన్‌షిప్ ఓపెన్ కేటగిరీలో 193 బోర్డులపై 385 మంది.. బాలికల విభాగంలో 98 బోర్డులపై 194 మంది తొలి రౌండ్‌లో పోటీపడ్డారు. వీరిలో కొంత మంది ఫిడే రేటెడ్ ఆటగాళ్లతో పాటు మాస్టర్స్ టైటిల్స్ సొంతం చేసుకున్న చిన్నారులు ఉన్నారు.

ఎత్తుకు పైఎత్తులు

విశాఖ స్పోర్ట్స్: అండర్–11 జాతీయ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో రేటెడ్ ఆటగాళ్ల విజయాలతో తొలి రౌండ్‌ను ముగించి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. ఎరీనా ఫిడే మాస్టర్(ఏఎఫ్‌ఎం) హన్షిత్, ఎరీనా క్యాండిడేట్ మాస్టర్లు(ఏసీఎం) కపిల్ నితిన్, రైవాన్ తొలి రౌండ్‌లో ఓటమితో వెనుకబడ్డారు. టోర్నీ టాపర్‌గా బరిలోకి దిగిన కర్నాటక చిన్నారి అపార్, ఏఎఫ్‌ఎంలు పవన్, ఆరవ్, పరంబ్రాతా, యువనేష్, ఆద్యాన్ తొలి రౌండ్‌లో విజయం సాధించారు. ఏసీఎంలు జలకాష్, విశ్రుత్, బాలానందన్, తవిష్, కార్తికేయ, స్వయమ్, క్యాండిడేట్ మాస్టర్(సీఎం) వివాన్, ఎరీనా ఇంటర్నేషనల్ మాస్టర్(ఏఐఎం) సయిద్, ఆదిక్ తొలి రౌండ్‌లో సత్తా చాటి రెండో రౌండ్‌కు సిద్ధమయ్యారు.

టోర్నీ టాపర్‌గా బరిలోకి..



కర్ణాటక నుంచి ఈ టోర్నీలో పాల్గొనేందుకు వచ్చాను. 2067 ఫిడే రేటింగ్‌తో టోర్నీ టాపర్‌గా అవకాశం వచ్చింది. స్టాండర్డ్ చెస్‌తో పాటు ర్యాపిడ్, బ్లిట్జ్ చదరంగంలోనూ పోటీపడుతుంటాను. జాతీయస్థాయిలో యాక్టివ్ ప్లేయర్స్ లిస్టింగ్‌లో 369వ ర్యాంక్‌లో ఉన్నాను. టాప్ ర్యాంక్‌ను కొనసాగిస్తూ ఫిడే రేటింగ్‌ను మెరుగుపరుచుకుంటాను.

– అపార్, ఓపెన్ టోర్నీ టాప్ ర్యాంకర్

విజయంతో టోర్నీ మొదలు



ఓపెన్‌తో పాటు బాలికలకు ప్రత్యేకంగా ఈ టోర్నీ జరుగుతోంది. ప్రస్తుతం 1615 రేటింగ్‌తో బాలికల్లో టాప్ ర్యాంక్‌తో తొలి రౌండ్ ప్రారంభించాను. చదరంగంపై ఆసక్తితోనే ఈ స్థాయికి చేరాను. తొలి రౌండ్‌లో తమిళనాడుకు చెందిన అభిగలిపై విజయంతో టోర్నీ మొదలుపెట్టాను. మొత్తంగా స్విస్ పద్ధతిలో 11 రౌండ్ల టోర్నీ ఇది. బాలికల కేటగిరీలోనూ ఎరీనా ఫిడే మాస్టర్లు నలుగురు, ఎరీనా క్యాండిడేట్ మాస్టర్లు ఒకరు పోటీపడుతున్నారు. వారితో రానున్న రౌండ్లలో పోటీపడాల్సి ఉంటుంది.

–ఆముక్త, బాలికల టోర్నీ టాప్ ర్యాంకర్



సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నర్సీపట్నం: జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా పూడి వెంకట్రావు, పట్నాల సతీష్, అధ్యక్షులు జి.సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు సిహెచ్.రామచంద్ర, ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు, ఉప కార్యదర్శులుగా ఆర్.రమణ, పి.విజయ, ట్రెజరర్‌గా అబ్దుల్ ఖాదర్‌ను ఎన్నుకున్నారు.



కొత్తగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ

దేవరాపల్లి: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అన్నారు. మండలంలోని తెనుగుపూడి గ్రామానికి మంజూరైన పది నూతన పింఛన్లను ఆమె లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. మానసిక దివ్యాంగురాలైన గ్రామానికి చెందిన విసారపు లాస్య(8)కు వేలిముద్రలు, ఐరీస్ పడకపోవడంతో మూడేళ్లుగా పింఛన్ మంజూరు కాలేదు. ఇదే సమస్యను గడపగడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్సార్ జయంతి రోజున గ్రామానికి విచ్చేసిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వద్దకు సదరు బాలికను అనురాధ స్వయంగా తీసుకెళ్లి సమస్యను వివరించారు. ఈ నేపథ్యంలో పింఛన్ మంజూరు కాగా అనురాధ అందజేశారు. బాలిక తల్లి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, సలాది కొండలరావు, కిల్లాన శ్రీనివాసరావు, దాసరి గోవిందరావు, భీమిన పోతురాజు, వారాది గౌరినాయుడు, యాళ్ల దేముడుబాబు, వూట గురువునాయుడు, వలంటీర్లు పాల్గొన్నారు.



తెనుగుపూడిలో నూతన పింఛన్లు అందజేస్తున్న ఈర్లె అనురాధ

వారసత్వ సంపదను కాపాడుకుందాం

కొమ్మాది: వారసత్వ సంపదను పరిరక్షించుకుని.. భావితరాలకు అందించాలని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ముస్తక్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవాలో భాగంగా మంగమారిపేట శిలా తోరణం వద్ద ఆదివారం నిర్వహించిన ఏక్ తారీఖ్ ఏక్ గంట శ్రమదాన్‌లో ఆయన పాల్గొన్నారు. ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన శిలా తోరణాన్ని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పరిరక్షించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇక్కడ బీచ్‌లో వ్యర్థాలను తొలగించారు. రీజినల్ డైరెక్టర్ బిదిషా గుప్తా, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, నేవీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాది యువకుల ఔదార్యం

ముగ్గురికి రూ.90 వేలు ఆర్థికసాయం



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న గ్రామ పెద్దలు, యువకులు

బుచ్చెయ్యపేట: మానవ సేవే మాధవ సేవ అని వడ్డాదికి చెందిన యువకులు చేతల్లో చూపి తమ ఔదార్యాన్ని, సమాజసేవా మార్గాన్ని చాటి చెప్పారు. అనారోగ్యం బారినపడి, ఇతర కారణాలతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతున్న ముగ్గురిని ఆర్థికంగా ఆదుకుని వారి పట్ల సమాజానికి ఉన్న బాధ్యతను గుర్తు చేశారు. మండలంలోని వడ్డాదికి చెందిన యువకులు రూ.90 వేలు పోగు చేసి ఆదివారం వారికి అందించి నిర్వేదంలో కాలం వెల్లదీస్తున్న వారి కళ్లల్లో వెలుగులు నింపారు. రెల్లి వీధిలో ఉంటున్న వితంతువు ముత్యాల జ్యోతి, తన ఇద్దరు పిల్లలను పెంచుతూ, చదివించడానికి నానా కష్టాలు పడుతుందని గ్రహించిన యువకులు ఆమె ఇద్దరి పిల్లల పేరున రూ.40 వేలు డిపాజిట్ చేశారు. పెద్ద బజారువీధిలో ఉంటున్న పేద వృద్ధురాలు బేరా కొండాజీకి రూ.30 వేలు, మాడుగులకు చెందిన యువకుడు పెదబీర పెంటయ్య కేన్సర్ వ్యాధి బారినపడగా అతడి వైద్య సహాయం నిమిత్తం రూ.20 వేలు గ్రామపెద్దల సమక్షంలో అందజేశారు. వారి సేవా నిరతిని పలువురు అభినందించారు. యువత సహాయాన్ని పొందిన కుటుంబీకులు వారి పట్ల తమ కృతజ్ఞతలు తెలిపారు.

విజిల్స్ వేస్తే చట్టాలు మారవు



జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా

పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రబాబునాయుడుకు అనుకూలంగా కంచాలు మోగించి, విజిల్స్ వేస్తే చట్టాలు మారిపోవని, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా అన్నారు. పట్టణంలో గల తన కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్‌లో స్కామ్ చేసినందుకే కోర్టు రిమాండ్ విధించిందన్నారు. రోజుకో విధంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న టీడీపీ నాయకుల పట్ల ప్రజలు అసంతృప్తి చెందుతున్నారని తెలిపారు. టీడీపీ కంచాల మోత కార్యక్రమానికి స్పందన లేదన్నారు. చంద్రబాబు కోర్టులో నిర్దోషిగా నిరూపించుకోవాలే తప్ప, ప్రజలు చీదరించుకునే పనులు చేయడం తగదన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను అరెస్టు చేసినప్పుడు కాపు నాయకులు నిరసన కార్యక్రమాలు చేస్తే వారిపై కేసులు పెట్టారన్నారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం అరెస్టులు చేయలేదా అని ఎద్దేవా చేశారు. తండ్రి ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచినప్పుడు మాట్లాడని కూతురు భువనేశ్వరి చంద్రబాబును అరెస్టు చేస్తే మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గాంధీ జయంతి నాడు టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. దేశానికి స్వాతంత్రం సాధించిన గాంధీ జయంతి నాడు చంద్రబాబు అరెస్టుకు నిరసన చేయడం తగదన్నారు.

గాంధీ వీధి... మహనీయుల స్ఫూర్తి

- కేజే పురంలో వినుతికెక్కిన వైనం
- ఏటా గాంధీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు
- నేడు గాంధీ జయంతి సందర్భంగా



కె.జె.పురంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం

మాడుగుల రూరల్: జాతిపిత జ్ఞాపకార్థం కె.జె.పురం గ్రామంలో ఒక వీధికి గాంధీవీధిగా ఒకనాడు నామకరణం చేశారు. దేశ నాయకుల విగ్రహాలకు కేరాఫ్ అడ్రస్‌గా కె.జె.పురం ప్రసిద్ధికెక్కింది. మాజీ సర్పంచ్ అయిన కీర్తిశేషులు పాలకుర్తి శ్రీరామూర్తి 1957లో గాంధీ, నెహ్రూ, బోస్, విగ్రహాలను బొంబాయి నుంచి తీసుకొచ్చి అప్పట్లో గ్రామంలో ప్రతిష్ఠించారు. గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద ప్రతి ఏటా గాంధీ జయంతి అక్టోబరు 2వ తేదీన జయంతి, జనవరి 31వ తేదీ వర్ధంతి మరుసటి రోజున తీర్థం ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. అలాగే గాంధీ వీధి చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు గాంధీ వీధి చిరునామాతోనే నేటికీ ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తున్నారు. ఆధార్, ఇతర వాటిలో గాంధీ వీధిగా పెడుతున్నారు.

వహ్వా.. 'కాఫీ'

- తోటలను సందర్శించిన ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి చలపతిరావు



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి చలపతిరావు దంపతులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ ఆధీనంలో సాగవుతున్న కాఫీతోటలు, అంతరపంటగా వేసిన మిరియాల పాదులను సందర్శించి సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి,రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి పి.వి.చలపతిరావు ఫిదా అయ్యారు. ఏజెన్సీలో రెండు రోజుల నుంచి కుటుంబంతో వ్యక్తిగత పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి, మోదమ్మకు సతీసమేతంగా పూజలు చేశారు. అనంతరం చలపతిరావు దంపతులకు డీఎఫ్‌వో వినోద్‌కుమార్, ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావు,ఆలయ కమిటీ ప్రతినిధులు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. తరువాత మినుములూరు ఏపీఎఫ్‌డీసీ పరిధిలోని సంగోడి ఎస్టేట్ కాఫీతోటలు, మిరియాల పాదులను పరిశీలించారు. పాడేరు డివిజన్ వ్యాప్తంగా ఏపీఎఫ్‌డీసీ ఆధీనంలో సాగవుతున్న కాఫీతోటలు ద్వారా వస్తున్న ఆదాయం వివరాలను తెలుసుకున్నారు. మినుమూలూరులోని మిరియాల పాదుల నర్సరీలు, మిరియాల సాగును కూడా ప్రత్యేకాధికారి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఎస్.రాయవరం: మండలంలోని పెదఉప్పలంలో లండా జోగిరాజు హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని నర్సీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. హతుడు జోగిరాజుకు మొదటి నిందితుడు కుందూరు రాములుకు మధ్య పలు వివాదాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం రాములు తన కుమారుడు అప్పలరాజు, హతుడు జోగిరాజుతో కలిసి మద్యం సేవించారన్నారు. ఆ తర్వాత గ్రామ శివారుకు తీసుకెళ్లి మంచం కమ్మెతో తలపై గట్టిగా కొట్టి హత్య చేశారన్నారు. గ్రామంలోనే నిందితులను పట్టుకుని విచారించగా నేరం అంగీకరించారన్నారు. 24 గంటల్లోనే హత్య కేసు ఛేదించిన నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్.రాయవరం ఎస్‌ఐ ప్రసాద్‌లను డీఎస్పీ అభినందించారు. ఈ మేరకు నిందితులను పూర్తి ఆధారాలతో కోర్టుకు తరలిస్తామన్నారు.

ఎయిర్‌పోర్టులో ఎక్స్‌ట్రా పార్కింగ్

- ప్రస్తుతం 500 కార్ల నిలిపే సామర్థ్యం
- విస్తరణతో మరో 200 కార్లకు అవకాశం
- ఈ విమానాశ్రయానికి అధికమైన పాసింజర్ల తాకిడి
- గత ఆగస్టుతో పోల్చుకుంటే పెరిగిన ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి రానురాను ప్రయాణికుల తాకిడి అధికమవుతోంది. అందుకనుగుణంగా ఇప్పటికే ఈ ఎయిర్‌పోర్టు అవసరమైన అన్ని హంగులను సమకూర్చుకుంటోంది. వీటితో పాటు కార్ పార్కింగ్‌ను కూడా విస్తరించుకుంది. ఈ విమానాశ్రయంలో ప్రస్తుత పార్కింగ్‌లో 500 కార్లను నిలిపే సామర్థ్యం ఉంది. ఇటీవల అందుబాటులోకి వచ్చిన పార్కింగ్‌లో అదనంగా మరో 200 కార్లను ఉంచేందుకు అవకాశం కలిగింది. రోజురోజుకూ ప్రయాణికుల రాకపోకలు పెరుగుతుండడంతో వాహనాల రద్దీ కూడా తీవ్రమవుతోంది. దీంతో ఎయిర్‌పోర్టుకు వచ్చే కార్లు, ఇతర వాహనాలను నిలపడానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడేది. ఇప్పుడు అదనపు పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి రావడంతో ఆ ఇబ్బంది నుంచి వాహనదార్లకు ఉపశమనం లభించిందని విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

తగ్గిన సర్వీసులు.. పెరిగిన ప్రయాణికులు

మరోవైపు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం దేశీయ (డొమెస్టిక్) ప్రయాణికుల రాకపోకల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఇతర ఎయిర్‌పోర్టులకంటే ఈ విమానాశ్రయం నుంచే ఎక్కువ మంది వెళ్లి వస్తున్నారు. 2022–23లో విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, కడప, తిరుపతి, కర్నూలు విమానాశ్రయాల నుంచి 48,25,904 మంది డొమెస్టిక్ పాసింజర్లు రాకపోకలు సాగించగా, వీరిలో ఒక్క విశాఖ ఎయిర్‌పోర్టు నుంచే 24,35,320 మంది ఉన్నారు. ఇక గత ఏడాది ఆగస్టుతో పోల్చితే ఈ ఆగస్టులో విమాన సర్వీసులు తగ్గినప్పటికీ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ఆగస్టులో ఈ ఎయిర్‌పోర్టు నుంచి 1,770 విమానాల ద్వారా 2,03,795 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ ఆగస్టులో 1,722 విమాన సర్వీసుల ద్వారా 2,41,917 మంది ప్రయాణించారు. అంటే 48 విమాన సర్వీసులు తగ్గినా, 38,122 మంది ప్రయాణికులు పెరిగారన్న మాట!

ఆక్యుపెన్సీలో హైదరాబాద్ టాప్

ఈ ఏడాది ఆగస్టులో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ప్రయాణికుల ఆక్యుపెన్సీ హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కతా సెక్టార్ల విమాన సర్వీసులకు ఎక్కువగా ఉంది. విశాఖపట్నం–హైదరాబాద్‌ల మధ్య తిరిగే విమానాల్లో సీటింగ్ కెపాసిటీ 44,752కి గాను 42,038 మంది (93.94 శాతం) ప్రయాణించారు. విశాఖ–ఢిల్లీల మధ్య సర్వీసులకు 21,642 మంది సీటింగ్ సామర్థ్యం ఉండగా 19,542 మంది (90.30 శాతం) రాకపోకలు సాగించారు.

ఆగస్టులో ఈ ఎయిర్‌పోర్టు నుంచి సెక్టార్ల వారీ ప్రయాణికుల ఆక్యుపెన్సీ

ఎక్కడకు?	సామర్థ్యం	ప్రయాణికులు	ఆక్యుపెన్సీ (శాతం)
హైదరాబాద్	44,752	42,038	93.94
ఢిల్లీ	21,642	19,542	90.30
బెంగళూరు	26,274	23,028	87.65
ముంబై	12,462	10,800	86.66
చెన్నై	14,400	11,587	80.47
కోల్‌కతా	3,600	3,268	90.78

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ గాజువాక తుంగ్లాంలో 130 గజాలలో 2 ఫ్లోర్ ఇల్లు 45 లక్షలకే అమ్మకానికి కలదు. ఫోన్: 70936 32399, 73864 14017 [V-794491]

■ 30x30 = 900 Sft. S/F, (2 Floors Building) Door No. 31-3-17, Kummari Street, Allipuram, No Broker's, Direct Parties only, Contact : 94414 65409 [V- 797417]

స్థలం అమ్మకం

■ పైడివాడ అగ్రహారం నందు ఈస్ట్ ఫేసింగ్‌లో 13 సెంట్లు స్థలం అమ్మకమునకు కలదు. ఫోన్: 91339 09303, 90101 77199 [V-780477]

PLOT FOR SALE

■ మధురవాడ ఏరియా బక్కన్నపాలెం విశాలాంగుల ITI ప్రక్కన, B.N.Reddy Layoutలో, VUDA Approved 130, 167, 233, 267, 311, చ॥గల E/W/S Facing Plots అమ్మకమునకు కలవు. ఫోన్ : 98481 82512, 96401 23102 [V-2164]

■ గ్రేటర్ విశాఖపట్నం 77వ వార్డులో 116 గజాలు 8 లక్షలు, మొత్తం 150 ప్లాట్లు. దగ్గరలో ఇల్లులు, బస్సులు, హాస్పిటల్, రైతుబజార్ ఉన్నవి. డైరెక్ట్ పార్టీస్. ఫోన్: 738641 4017 [V- 794490]

■ గజం కేవలం 3,999/–లకే 30 ఎకరాలలో ప్లాంటేషన్ & అద్భుతమైన రిసార్ట్‌లో స్థలం అమ్మబడును. స్పాట్ రిజిస్ట్రేషన్ కలదు. శ్రీకాకుళం నుండి వైజాగ్ మధ్యలో గల ఎచ్చెర్లకి 10 నిమిషాలు ప్రయాణం & బీచ్ కారిడార్‌కి అతి దగ్గరలో. ఫోన్: 70139 04775, 73827 03167 [V- 5937]

■ విశాఖ జిల్లా పద్మనాభంలో అతి తక్కువ ధరల్లో 100, 120చ॥గ॥లు స్థలములు ఎర్రచందనం ప్లాంటేషన్‌తో కలవు. EMI Available. 9110770493, 7013822883 [S-1191168]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10987]

OLD AGE HOME

■ వృద్ధులకు మంచాన ఉన్నవారికి ఆహ్లాదకర వాతావరణంలో 8 వేలకే షేరింగ్ రూమ్ డాక్టర్లు, నర్స్ 24 గం॥ మీ ఇంటి వద్దకే సేవలు. @ పంజాబ్ హోటల్ జం॥ హైవే ప్రక్కన. ఫోన్: 63046 41223 [V- 660]

■ SVS Old Age Home, VZM రుచికరమైన భోజనం, వసతి A/C, Non A/C రూమ్స్, రాత్రి పగలు ఆయాలు, నర్సుల పర్యవేక్షణలో వయోవృద్ధులకు ప్రత్యేకమైన సర్వీస్ కలదు. సంప్ర : 94404 35006, 93479 78875 [V- 2715]

Wanted

■ Wanted NET / Xerox Operator. Part / Full Time. Attractive Salary. Sai Net, RTC Complex, Dwarakanagar, Vizag-16. Ph : 98482 81659, 90009 20204 [V- 2165]

■ విశాఖపట్నం, మద్దిలపాలెం మాల్‌లో సెక్యూరిటీ గార్డులు (M/F) 50 మంది కాలెను. 8 గంటలు డ్యూటీ. జీతం: 12,000/-. ✆ 70939 31732 [B-1206666]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221755]

■ కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు, ప్రముఖుల ఇళ్ళ వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కావలెను. Sal: 14-20K వసతి + భోజనం, విజయవాడ ✆ 91608 35559, 78158 35561 [B-385]

■ విశాఖపట్నం, అచ్యుతాపురంలో సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ (Ex or Civil) జీతం: 20,000 సెక్యూరిటీ గార్డ్స్ జీతం: 15,000/- కావలెను. డ్యూటీ: 8 గంటలు, వీక్లీ ఆఫ్, PF & ESI, ఉచితవసతి. సంప్ర॥ ✆ 89779 37255. [B-1206664]

■ Wanted Xerox & DTP Operators Telugu & English Typing Must. Sal : 15,000/- @ Siripuram, Vizag. Call : 90109 11112 [V-1220]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221727]



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.



- అద్దెకు
- అమ్మకం
- రియల్ ఎస్టేట్
- ఫర్నీచర్స్
- ఆటోమొబైల్స్
- కంప్యూటర్స్
- సర్వీసెస్
- కావలెను

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం



కనకమహాలక్ష్మి వీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన నాయకులు

కశింకోట : కశింకోటలోని కనకమహాలక్ష్మి వీధిలో ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. పొక్లెయిన్‌తో కాలువ తవ్వకాలు చేపట్టారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులతో పనులు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎంహెచ్ స్కూల్లో అబ్దుల్ కలాం సేవా సంఘం సహకారంతో ఆదివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు జరిగాయి. సోమవారం జరిగే గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించినట్లు సంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నేడు బహుమతి ప్రదానం చేయనున్నామన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం నేడు

కశింకోట : స్థానిక కస్పావీధి రామాలయం వద్ద సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల పక్షోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే శిబిరం మధ్యాహ్నం 2 గంటలకు ముగుస్తుందన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొని రోగులను పరీక్షిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కూడా ఉచిత సేవలందిస్తారన్నారు. ఈహెచ్‌ఎస్, ఆధార్ కార్డులు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

సోహంలో మహా మృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : మండలంలో బట్లపూడి పంచాయతీ నాయుడుపేట సోహం ఆశ్రమంలో ఆదివారం మహామృత్యుంజయ హోమం జరిగింది. ఈ కార్యక్రమానికి విశాఖ కూర్మన్నపాలెం ఉపాధ్యాయ కుటుంబ సభ్యులు హాజరైనట్లు ఆశ్రమం నిర్వాహకుడు రవి చెప్పారు.

అనకాపల్లి సినిమాలు

పెదకాపు	: రాజా
స్కంద	: సత్యనారాయణస్క్రీన్-1
సప్త సాగరాలు దాటి	: సత్యనారాయణస్క్రీన్-2
జవాన్ (మార్నింగ్ మ్యాట్నీ)	
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: షిర్డిసాయి
స్కంద	: పర్తిసాయి
ఖుషి	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
చంద్రముఖి 2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 299 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

చేతులు కలిపి.. స్వచ్ఛత నిలిపి

- ఎంపీ బీవీ సత్యవతి
- నాయకులు, అధికారులతో కలిసి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహణ



గాంధీ పార్కును శుభ్రం చేస్తున్న ఎంపీ బీవీ సత్యవతి, జానకీరామరాజు తదితరులు

అనకాపల్లిటౌన్: పరిశుభ్రమైన పరిసరాలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు స్థానిక గాంధీపార్కులో ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కోసం అందరూ కృషి చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యానికి సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని అన్నారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతిని పురస్కరించుకుని ముందు రోజు ఇటువంటి కార్యక్రమం దేశవ్యాప్తంగా చేపట్టడం అభినందనీయమని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ పరిశుభ్రతతో అందరూ ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఎస్.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జీవీఎంసీ సిబ్బంది, పార్టీ నేతలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అనారోగ్యాలు దూరం..

పరిసరాల పరిశుభ్రతతోనే అనారోగ్య సమస్యలు దూరం అవుతాయని 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ అన్నారు. పట్టణంలో 10, 11, 12 సచివాలయాల పరిధిలో ఆదివారం స్వచ్ఛ పరిరక్షణ శ్రమదానం నిర్వహించారు. నెయ్యిలవీధి, పిళ్లావారివీధుల్లో పలు రహదారులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గాడి మధురినాయుడు, ఆడారి రవి, నారాయణరావు, త్రినాథ్, కేతిరెడ్డి ప్రసాద్, సచివాలయ సిబ్బంది ఉదయ్, ప్రసాద్, సత్యనారాయణ, గణేష్, సతీష్ పాల్గొన్నారు.



80వ వార్డులో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దాడి రత్నాకర్, పార్టీ శ్రేణులు

పలు ప్రాంతాల్లో..

పట్టణంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం యజ్ఞంలా జరిగింది. స్థానిక డైట్ కళాశాల, పల్లవువీధి పట్టణ ఆరోగ్య కేంద్రం, బీసీ వసతిగృహం, కమ్యూనిటీ హాలు, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్, పార్టీ శ్రేణులు పి.శివ అప్పారావు, పి.నాగేశ్వరరావు, సన్యాసిరావు, ఎల్.శ్రీనివాస్, కె.అప్పాజీ, కె.ఆరుద్ర, డి.త్రినాథ్, ఆర్.ఇంద్రకుమార్, ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

• స్థానిక 83వ వార్డు పరిధిలో గూడ్స్‌రోడ్డు షిర్డీసాయిబాబా ఆలయ సమీపంలో వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, కోరుకొండ రాఘవ తదితరులు రోడ్లపై చెత్తను ఊడ్చి డబ్బాలో వేశారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ కమిటీ డైరెక్టర్ ఒడిశెట్టి కనకమహాలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండా రమేష్‌గుప్త, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ సత్యవతి తదితరులు

• స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ నేతలు ఆలయ ఆవరణను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కర్రి రామకృష్ణ, మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్ పాల్గొన్నారు.

చీపుర్లు పట్టిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

అనకాపల్లి రూరల్ : ప్రధాని మోదీ పిలుపు మేరకు మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పారిశుధ్య సిబ్బంది ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, గ్రామ పెద్దలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని పరిసరాల్లో చెత్త, తుప్పలు, పొదలు, మురుగు కాల్వల్లో పూడిక తొలగించారు. మేజర్ పంచాయతీలు తుమ్మపాల, కొత్తూరు, పిసినికాడల్లో రహదారులను శుభ్రపరిచారు. తుమ్మపాలలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. చీపుర్లు చేతబట్టి అంతర్గత రహదారులపై చెత్త ఊడ్చారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి కొత్తపేట గంగాలమ్మపుట్ట వరకూ కాల్వల్లో చెత్త తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కర్యక్రమం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యనిర్వహణాధికారి కె. శ్రీనివాసరావు, ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి, పన్నీరు చంటి, వార్డు సభ్యులు తర్ర సత్యారావు, రామారావు, మొగసాల వెంకట్, కొయ్య జగదలక్ష్మి, భాస్కర్, ఆడారి ప్రసాద్, బీఎస్ఎన్ఎల్ జిల్లా సలహా కమిటీ సభ్యుడు పీలా విశ్వేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీను, సచివాలయ కార్యదర్శి సత్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు, పిసినికాడ గ్రామాల్లో..

కొత్తూరు మేజర్ పంచాయతీ, పిసినికాడ పంచాయతీల్లో ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కె. ధర్మారావు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. చీపుర్లు పట్టి చెత్త ఊడ్చారు. గ్రామ పంచాయతీల సిబ్బంది, స్థానిక పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడం ద్వారా స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములు కావాలని ఈవోపీఆర్డీ ధర్మారావు ప్రజలకు పిలుపునిచ్చారు.

ఏఎస్ పేటలో..

కశింకోట : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు కోరారు. మండలంలోని ఏఎస్ పేటలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చెత్త, తుప్పలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలతో పాటు అన్ని ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పి.బి. రాజు, డిజిటల్ అసిస్టెంట్ పి. ముత్యాలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎస్. శ్రీను, వీఆర్‌వో జి. ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తుమ్మపాలలో శుభ్రం చేస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు, పారిశుధ్య సిబ్బంది



84వ వార్డు ఇన్‌చార్జి రాఘవ ఆధ్వర్యంలో రహదారిని శుభ్రం చేస్తున్న నాయకులు



కొత్తూరులో చెత్త ఊడ్చుతున్న ఎంపీడీవో నరసింహారావు, ఈవోపీఆర్డీ ధర్మారావు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు



గూడ్స్‌రోడ్డులో రహదారిని శుభ్రం చేసి చెత్తను డబ్బాలో వేస్తున్న జాజుల రమేష్, పార్టీ శ్రేణులు

ప్రత్యేక పూజలు.. అన్న సమారాధనలు



వినాయకుడిని దర్శించుకుంటున్న ఎంపీ సత్యవతి తదితరులు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న జానకీరామరాజు, రమేష్



వేలంలో లడ్డూను దక్కించుకున్న సరోజిని, కుమారస్వామి

అనకాపల్లిటౌన్ : ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నవరాత్రులు నిర్వహించడం శుభపరిణామమని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక పూడిమడక బైపాస్ జంక్షన్ వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఎంపీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, డీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఠా కార్మికుల యూనియన్ అధ్యక్షుడు మంద రాము, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

• స్థానిక శారదా కాలనీ, విజయరామరాజుపేట, ఉమ్మలాడల్లో ఏర్పాటు చేసిన గణనాథులను వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జాజుల రమేష్ దర్శించుకున్నారు. అంతకు ముందు అన్నసమారాధలను ప్రారంభించారు. ఆయా కమిటీల సభ్యులు జానకీరామరాజు, రమేష్‌లను ఘనంగా సత్కరించారు. విజమరామరామరాజుపేట ఆళ్లవారి వీధిలో బాల గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం లడ్డూ వేలం పాట జరిగింది. పాటలో ఆడారి సరోజిని, కుమారస్వామి రూ.25 వేలకి లడ్డూ దక్కించుకున్నారు.

గణపతికి డీఎస్పీ పూజలు..

కశింకోట : యువత ఆధ్యాత్మిక భావనతో మెలగటం ఆనందంగా ఉందని డీఎస్పీ పి. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చింతలపాలెంలో అభయాంజనేయస్వామి మండపంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టె రాము, మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, పాల సంఘం వేతన కార్యదర్శి జెర్రిపోతుల నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనాలు..

• కశింకోటలో ఆదివారం గణేష్ నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇక్కడి సాయినగర్ అఫీషియల్ కాలనీలో నెలకొల్పిన గణేష్ విగ్రహాన్ని డప్పులు, వాయిద్యాలు, యువకుల నృత్యాలతో వ్యాన్‌పై తరలించారు. అనంతరం స్థానిక గవరపేటలోని పెద్దగుమ్మం వద్ద విగ్రహానికి పురోహితుడు ఎన్. సూరిబాబు సంప్రదాయ పూజలు చేశారు. తర్వాత ఉత్సవ నిర్వాహకులు స్వామి విగ్రహాన్ని నదిలో నిమజ్జనం చేశారు. అలాగే పలుచోట్ల వినాయక విగ్రహాలను కూడా ఊరేగించి నిమజ్జనం చేశారు.

పాయకరావుపేట: పట్టణంలోని రాజుగారిబీడులో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల సందర్భంగా ఆదివారం అన్న సమారాధన ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు దోమాడ సుందరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, పంచాయతీ ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాసరావులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జగతా శ్రీను, కేశనకుర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న గూటూరు శ్రీనివాసరావు, జగతా శ్రీనివాసరావు



చింతలపాలెంలో డీఎస్పీ శ్రీనివాసరావును సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు



పెద్దగుమ్మం వద్ద శారదా నది ఒడ్డున గణేష్ విగ్రహానికి పూజలు



శారదా నదిలో గణేష్ విగ్రహం నిమజ్జనం

సీఎంగా మళ్లీ జగనన్ననే గెలిపించుకోవాలి



ఆడారి వీర వెంకట సత్యనారాయణ

అనకాపల్లిటౌన్ : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అనకాపల్లి జిల్లా న్యాయవిభాగం అధ్యక్షుడు ఆడారి వీర వెంకట సత్యనారాయణ (స్వామి) అన్నారు. గవరపాలెంలోని కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంకల్ప యాత్రలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన తర్వాత అమలు చేసిన ఘతన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కొత్తగా జూనియర్ లాయర్‌గా చేరిన వ్యక్తికి 'లా నేస్తం'కింద నెలకు రూ. 5 వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేయడం అభినందనీయమన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలు అందుకోవాలని ఆయన కోరారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట



దసరా ఉత్సవాల పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శతకంపట్టులో శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి రాట కార్యక్రమం ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద వ్యవస్థాపకులు పీవీ రమణ, కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ కర్రి సన్యాసి నాయుడు దంపతులు చేపట్టారు. అంతకు ముందు కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీవీ రమణ మాట్లాడుతూ దసరా నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారి ఆలయం వద్ద ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పాలిమేర శ్రీను, బుద్ద సంతోష్, కొణతాల మురళీకృష్ణ, కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, దాడి కృష్ణ, కె.ఎం.నాయుడు, భీశెట్టి వరహ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో హర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

అనకాపల్లిటౌన్ : వర్షంతో పట్టణవాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం సాయంత్రం గంట ఎడతెరిపివ్వకుండా కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సాయంత్రం 4 నుంచి 5 వరకు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నర్సింగరావుపేట షిర్డీసాయిబాబా ఆలయం వెనుకవీధిలో మోకాలు లోతున వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో ఇటీవల డ్రైనేజీ నిర్మాణ పనులు జీవీఎంసీ అధికారులు చేపడుతున్నారు. ఈ పనుల కోసం రహదారిపై యంత్ర పరికరాలు ఒక్క పక్క.. మరో పక్క వర్షపునీరు రహదారిపై నిలిచిపోవడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. అనకాపల్లి – చోడవరం ప్రధాన రహదారిలో రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో లక్ష్మీదేవిపేట రైల్వేక్రాసింగ్ మీదుగా ట్రాఫిక్ పోలీసులు భారీ వాహనాలను మళ్లించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, ఏఎంసీకాలనీ, గవరపాలెం పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండలంలో తుమ్మపాల పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు గ్రామస్తుల సహకారంతో చేపట్టి కాలువలను శుభ్రం చేసినప్పటికీ శ్రమదానం కాస్త వర్షంతో వృథా అయింది.

బొడ్డేడకు ఘన సత్కారం

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో ఆదివారం పలువురు పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ప్రసాద్‌ను సత్కరించిన వారిలో సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ కె.ఎం.నాయుడు, రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు ఉన్నారు.



బొడ్డేడ ప్రసాద్‌ను సత్కరిస్తున్న కె.ఎం.నాయుడు, లక్ష్మీనర్సింహారావు తదితరులు

5న నేత్ర వైద్య శిబిరం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో ఈ నెల 5న ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సౌజన్యంతో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనకాపల్లి జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల సంయుక్త నిర్వహణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరం జరుగుతుందన్నారు.

5న చలో స్టీల్‌ప్లాంట్

పరవాడ: కూర్మన్నపాలెం కూడలిలో ఈ నెల 5న సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్న చలో స్టీల్‌ప్లాంటు బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన పరవాడలో ఆదివారం గోడపత్రిక విడుదల చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న మణిహారం విశాఖ స్టీల్‌ప్లాంటు లక్ష మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించిందన్నారు. ఈ బంగారు బాతును కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మకానికి పెట్టిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ఉద్యమించాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వి.వి.రమణ, ఎ.నాగేశ్వరరావు, ఎం.బంగార్రాజు, రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం



స్నేహితుడికి నగదు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

పరవాడ: వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న నునపర్తికి చెందిన పెదపూడి తాతాజీ రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు కాలువలో పడిపోవడంతో కాలు విరిగిపోయి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు తాతాజీని ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు, కొంత నగదును ఆదివారం స్నేహితుడు తాతాజీకి అందజేశారు. తమ వెల్ఫేర్ గ్రూపు ద్వారా తోటి స్నేహితులు ఆపదలో ఉంటే ఆదుకోవాలని నిర్ణయించామని పూర్వ విద్యార్థి కన్నూరు శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో బండారు ముత్యాలనాయుడు, కండిపల్లి నేస్తాలు, ఎం.మారునాయుడు, బి.బాబూరావు, అక్కమ్మ, కె.దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

పరవాడ: వలంటీర్లు ఆదివారం తెల్లవారక ముందే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. నాయుడుపాలెంలో సర్పంచ్ వరలక్ష్మి పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి సోమవారం అందించనున్నట్టు వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణ్ చెప్పారు.



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనకాపల్లి :
9010973030, 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com